ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026 5 శ్రీ సత్యసాయి






మహిళా రైతుకు నూతన పాసుపుస్తకాన్ని అందిస్తున్న మంత్రి సవిత

మాటల్లోనే సంక్షేమం..!

- అమలు కాని ఎన్నికల హామీలు
- మహిళా సాధికారత కరువు
- అటకెక్కిన ఆడబిడ్డ నిధి
- ఊసేలేని నిరుద్యోగ భృతి
- విద్యార్థులకు అందని వసతి, విద్య దీవెన
- కొత్త పింఛన్ల మంజూరూ లేదు..



ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయకుండా ఏడాదంతా గడిపేసిందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో, సూపర్ సిక్స్‌లో చెప్పిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్లు తదితర పథకాల ఊసేలేదు. సంక్షేమ పథకాల కోసం పేద, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు ఎదురు చూపులు తప్పడం లేదు. మహిళా సాధికారత, సంక్షేమం దిశగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రకటనలతో ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఆడబిడ్డ నిధి.. ఊసేది..?

సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా 18 ఏళ్ల నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ద్వారా నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్న హామీ 2025లోనూ అమలు కాలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాన్ని అమలు చేస్తామని చెప్పి 18 నెలలు గడిచినా దీనిని అమలు చేయకుండానే కాలం గడిచిపోయింది. ఈ పథకం అమలైతే శ్రీ సత్యసాయి జిల్లాలో సుమారు 3.85 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

భ్రాంతిలా నిరుద్యోగ భృతి..

సూపర్ సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి ఈ ఏడాదీ అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం ఈ ఏడాదీ నెరవేర్చలేదు. దీనిపై విద్యార్థి సంఘాలు గళమెత్తుతున్నాయి. సత్యసాయి జిల్లాలో సుమారు 1.86 లక్షల మందికి పైగా నిరుద్యోగులు భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

కార్పొరేషన్ రుణాలేవీ..?

ఏడాది క్రితం బీసీ, కాపు కార్పొ రేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలిస్తామని ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. అయితే ఒక్కరికీ కూడా రుణాలు మంజూరు చేయలేదు. మహిళలు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుచేయాలని భావించారు. వీరి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. సత్యసాయి జిల్లాలో దాదాపు 3 లక్షల మందిపైగా కార్పొషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు మంజూరుకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. అంతటితో ఈ కార్యక్రమం ఆగిపోయింది.

నిరుపేదలకు సొంతిళ్లు కలేనా..?

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుస్తామని నాయకులు హామీలిచ్చారు. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు మంజూరు చేస్తామన్న హామీ ఏడాదిన్నర అయినా అమలుకు నోచుకోలేదు. ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేయాలని కాళ్లు అరిగేలా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా స్థలం, ఇల్లు కోసం వేల సంఖ్యలో పేదలు దరఖాస్తులు చేసుకున్నారు. సొంత ఇంటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని నిరుపేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఊసేలేని కొత్త పింఛన్లు మంజూరు

పేద, మధ్యతరగతి వర్గాల్లోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ ఏడాది ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదు. ఈ ఏడాదిలో కొత్త పింఛన్లు ఇస్తారని ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది. కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా సదరం పరిశీలన పేరిట పలువురు వికలాంగుల పింఛన్లను ప్రభుత్వం తొలగించేందుకు చర్యలు చేపట్టింది.

సంక్షేమ పథకాలు అంతంతమాత్రమే

ప్రభుత్వం మహిళలకు సంబంధించి సంక్షేమ పథకాల ఊసేఎత్తడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కాపు నేస్తం, చేయూత, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం. సున్నా వడ్డీ వంటి పథకాలు కూటమి ప్రభుత్వంలో నిలిచిపోయాయి. వైఎస్సార్ కాపు నేస్తం పథకంలో ఏటా రూ.15 వేల చొప్పున మహిళలకు అందించారు. వైఎస్సార్ చేయూత పథకంలో ఏటా రూ.18,750, ఈబీసీ నేస్తం పథకంలో వెనుకబడిన అగ్రవర్ణ పేద మహిళలకు ఏటా రూ.15 వేల చొప్పున అందించారు. నేతన్న నేస్తం పథకంలో సొంత మగ్గం ఉన్న చేనేత కార్మికుడికి నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి ఒకే విడతలో రూ.24 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం ఈ పథకాలేవి అమలుకావడం లేదు. కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే ఉన్నాయి.

అందని వసతి, విద్య దీవెన

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకం అమలు చేసింది. డిప్లొమా డిగ్రీ చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు, బీటెక్ ఎంబిబిఎస్ ఇతర ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.20 వేలు వసతి దీవెన పథకం కింద నగదు అందించేవారు. జగనన్న విద్యాదీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో జమ చేసేవారు. ఈ రెండు పథకాల ద్వారా ఇంత వరకు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది తప్ప క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల ఫీజు రీయిబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలను చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు చెల్లించిన దాఖలాలు లేవు.

'రాజముద్ర'తో రైతుల హక్కుల పరిరక్షణ

- చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- నాగినాయన చెరువులో నూతన పాసుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- సోమందేపల్లి

పట్టాదారు పాస్‌బుక్‌లపై రాజముద్ర వేసి రైతుల హక్కులు పరిరక్షించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. సోమందేపల్లి మండలం నాగినాయన చెరువు గ్రామంలో శుక్రవారం నాడు ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు భూమి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లపై జగన్ ఫొటో తొలగించి, రైతుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రను ముద్రించి, నూతన పాస్ బుక్ లు అందజేస్తున్నామన్నారు. రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను జిల్లాలో 31,368 మంది రైతులకు నూతన పాస్‌బుక్‌లు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. ప్రచార యావతో పాస్ బుక్‌లపైనా, సర్వే రాళ్లపైనా జగన్ రెడ్డి తన బొమ్మను వేసుకుని రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడానికి జగన్, వైసిపి నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకట రమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డి.వి.ఆంజనేయులు, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, మండల కన్వీనర్ వెంకటేష్, మాగే చెరువు సర్పంచి నరసింహులు, రైతు సంఘ నాయకులు హరికృష్ణ యాదవ్, మండల అభివృద్ధి అధికారి వెంకటలక్ష్మి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతి, పంచాయతీ కార్యదర్శులు శాంతి, రమేష్ పాల్గొన్నారు.



నూతన పాస్‌పుస్తకాలను చూపుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మంత్రి సవిత

బొలెరో బోల్తా.. 17 మంది కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని చిలకల గడ్డ పల్లి గ్రామం వద్ద కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో 17 మంది కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నల్లమాడ మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాదాపు 30 మంది వ్యవసాయ కూలీలు మండల పరిధిలోని పొడరాళ్లపల్లి గ్రామానికి వ్యవసాయ పనులు నిమిత్తం బొలెరో వాహనంలో వెళుతుండగా చిలకల గడ్డ పల్లి గ్రామం వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 17 మంది కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. జయమ్మ, కళావతి, చెన్నమ్మ, చిన్నకృష్ణమ్మ, గంగాదేవి, రత్నమ్మ, కేశమ్మ, ఉత్తన్న, రామాంజనేయులు, లక్ష్మీనరసింహలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని గ్రామస్తులు 108 వాహనం ద్వారా నల్లమాడ, పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఉత్తన్న, కళావతి లను మెరుగైన వైద్య సేవ కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని రాళ్లపల్లి గ్రామంలో 6 నెలలుగా తాగునీటి సమస్య నెలకొంది. ఈ విషయంపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆక్రోశించిన మహిళలు శుక్రవారం గ్రామ సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి తాగునీటి పథకం బోర్లలో నీరు సమృద్ధిగా ఉన్నా, ఆయా బోర్లలోకి పూర్తిస్థాయిలో పైపులు దించకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని తెలిపారు. దీనికి తోడు బోర్లకు ఏళ్ల తరబడి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం లేదన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లోని రైతుల ప్రయివేటు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్ వాడుతున్నారని తెలిపారు. గ్రామంలో కొన్నేళ్లుగా తరచూ తాగునీటి సమస్య తలెత్తుతుందని, పలుమార్లు సర్పంచి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ పరిపూర్ణాచారి మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి సోమవారం లోపు గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



తాగునీటి కోసం సచివాలయం ఎదుట ధర్నా చేపట్టిన మహిళలు

దీంతో మహిళలు శాంతించి వెనుదిరిగారు. అయితే పలువురు మహిళలు మాట్లాడుతూ సోమవారం లోపు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే మంగళవారం నుంచి గ్రామంలోని సచివాలయానికి తాళం వేస్తామని, సమస్య పరిష్కరించే వరకూ నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో శాంతమ్మ, వినోదమ్మ, నీలావతి, రత్నమ్మ, రంగమ్మ, లక్కమ్మ, తిప్పక్క, గిరిజమ్మ. తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ సిఎంఆర్‌ఎఫ్ : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 47 మంది పేదలకు మంజూరైన రూ. 20 లక్షల విలువ చేసే చెక్కులను శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సిఎం సహాయ నిధి పేదల జీవితాలకు సంజీవనిగా మారింద న్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని తెలిపారు.

'హేమావతి' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని హేమావతి జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు వైష్ణవి, సుమ తయారు చేసిన కెరీర్ గైడెన్స్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం లీలారాణి తెలిపారు. హెచ్ ఎం మాట్లాడుతూ కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి కెరీర్ గైడెన్స్ ప్రదర్శనలో వైష్ణవి, సుమ ఉండడం పాఠశాలకు గర్వకారణమన్నారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించిన విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందిం చారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడిబండ

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం గుడిబండలో ప్రజాప్రతి నిధులు, అధికారులు ఆవిష్కరించారు. తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ కేశవ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప మాట్లాడుతూ ప్రజాశక్తి కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతూ దినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమాల్లో ఈవోఆర్‌డి నాగరాజు నాయక్, ఎంపిటిసి శశిధర్, న్యాయవాది శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక పిహెచ్‌సిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు శుక్రవారం రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ భోజనం ఏర్పాటు చేశారు. రమానందన్ మాట్లాడుతూ ప్రతి వారం లాగే ఈ శుక్రవారం తన తల్లి పేరుపై 55 మందికి పౌష్టికాహారం అందజేశా మన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు చిరంజీవి, సిబ్బంది సుబ్రహ్మణ్యం, రమానందన్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

స్టేట్ లెవెల్ స్కిల్ కాంపిటీషన్‌లో అగ్రికల్చర్ విభాగంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు హర్షిణి, అనుష్క, అజయ్‌కుమార్, ఆదర్శ అత్యుత్తమ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని శుక్రవారం వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో సన్మానించి బహుమతులు అందజేశారు. అలాగే వారిని తీర్చిదిద్దిన నీలిమ, రెడ్డెమ్మ, హెచ్‌ఎం లక్ష్మినారా యణమ్మ, ఎంఇఒలు అరవింద్, జయభాస్కర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో వినాయక సేవా సమితి సభ్యులు లోక్‌నాథ్‌నాయుడు, రవిశంకర్, వేణుగోపాల్, పవన్ కుమార్, సి.రామాంజనేయులు, లింగమయ్య, తిప్పేస్వామి, రాజు, చిరంజీవి, రాజేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులు, ఉపాధ్యాయులను సన్మానించిన సేవా సమితి సభ్యులు

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అగళి

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్‌డిఒ ఆనంద్ ఆదేశించారు. ఇటీవల మడకశిరలో ప్రారంభమైన ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు తీసు కున్న ఆర్‌డిఒ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ పనులన్నీ సక్రమంగా పూర్తి చేయాలని తహశీల్దార్ సుబ్బారావును ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు.

4న యాదవుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అమరాపురం



ఈ నెల 4వ తేదీ ఉద యం 10.30 గంటలకు మండలం లోని ఉదుగూరు సమీపంలోని కెఎన్ ఎం తోటలో నిర్వహిస్తున్న యాదవ ఆత్మీయ సమావేశానికి యాదవ సామాజిక వర్గం ప్రజలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షులు జిఎస్.మంజు కోరారు. ఆయనతో పాటు ఎంపిటిజి జయరామ్, చిత్రశేఖర్, సిద్దేశ్వర, శివరం సర్పంచి మంజుల చిత్తయ్య, శివకుమార్, సురేశ్, టీచర్ గుమ్మన్న, శేషు, తిమ్మరాయప్ప, సన్నరంగప్ప, శివలింగప్ప, మల్లేష్, ఆర్‌ఎంపి మంజునాథ్ ఉన్నారు.

రీసర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-లేపాక్షి

4వ విడతలో భాగంగా మండల పరిధిలోని పులమతి, కల్లూరు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టనున్నట్లు తహశీల్దార్ సౌజన్య లక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రీసర్వేపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి రైతు రీసర్వేలో వివరాలు అందించి సహకరించాలని కోరారు. అలాగే గ్రామంలోని రైతులందరూ రీసర్వేలో పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. సదస్సులో సర్పంచి అశ్వత్థప్ప, గ్రామస్తులు మారుతి ప్రసాద్, కోటిపన్న, సాగు నీటి సంఘం అధ్యక్షులు ఇబ్రాహీంసాబ్, రెవెన్యూ అధికారులు ప్రమీలమ్మ, రమేష్‌బాబు, మండల సర్వేయర్ సుమిత్ర, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజలందరికీ న్యాయం

ప్రజాశక్తి-అమరాపురం

కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండలంలోని మద్దనకుంట గ్రామంలో కురుబ లక్ష్మి నాగరాజుకు కేటాయించిన నూతన రేషన్ షాపును శుక్రవారం టిడిపి నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజు, మంజన్న, చెన్నప్ప, రఘు, రవికుమార్ పాల్గొన్నారు.



వనజకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో బార్బర్‌షాపు నిర్వహిస్తున్న నాగార్జున(38) అనారోగ్యంతో గత నెల 25వ తేదీ ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య వనజ, కుమార్తెలు శాన్విక, యశ్వికతో పాటు 20 రోజుల కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబానికి ఆధారమైన నాగార్జున మృతితో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలోని తోటి దుకాణాల వారు నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూ. 10 వేలు పోగుచేసి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వనజకు అందజేశారు. దాతలు ఎవరైనా 99853 19445(విజయ్ కుమార్) ఫోన్ పే చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రవికుమార్, మంజునాథ్, విజయ్ కుమార్, అశోక్, దాలప్ప, శంకరప్ప, నాగరాజు, ఆదిమూర్తి, చంద్ర, చలపతి, మురళి పాల్గొన్నారు.

మంచానికి పరిమితం... అందని రూ.15వేల పింఛను

ప్రజాశక్తి-గుడిబండ



మంచానికి పరిమితమైన బాబుసాబ్

మండల పరిధిలోని శంకరగల్లు గ్రామానికి చెందిన దూదేకుల బాబుసాబ్ వయస్సు 68 సంవ త్సరాలు. ఇతడు 15 ఏళ్లుగా శరీర సంబంధిత జబ్బుతో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఆ రోగం నయం కాకపోగా కాళ్లు, చేతులు పూర్తిగా చచ్చుబడి కనీసం కదలడానికి కూడా సాధ్యం కాక మంచానికే పరిమితమ య్యాడు. మరో వైపు అతడి వైద్యం కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న బాబుసాబ్‌కు ప్రస్తుతం ప్రభుత్వం ఉంచి రూ. 4 వేల పింఛను మాత్రమే అందుతుంది. కుటుంబ పోషణ, బాబుసాబ్ వైద్య ఖర్చులతో పూటగడవని పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ ఇప్పించి బెడ్ రెస్ట్ వారికిచ్చే రూ. 15వేల పింఛను మంజూరు చేయాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-గుడిబండ, అగళి, మడకశిర రూరల్

మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజినల్ కార్యాలయం(ఆర్‌డిఒ) ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని సచివాలయ కేంద్రాల్లో కూటమి పార్టీల ఆధ్వ ర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు సిఎం చంద్ర బాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గుడిబండలో తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ కేశవరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో, అగళి మండలం నరసంబూది పంచాయతీ సచివాలయంలో జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో, మడకశిర మండలంలో కుంచితి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు నారాయణ గౌడ, శ్రీనివాస్, రంగనాథ్ ఆధ్వర్యంలో సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ చిత్రపటాలకు పాలు పోసి అభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సిఎం చంద్రబాబు మడకశిరకు ఆర్‌డిఒ కార్యాలయం మంజూరు చేయడంతో పాటు వెంటనే ఆర్‌డిఒ కార్యాలయాన్ని ప్రారంభించారని తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై ఈ ప్రాంత ప్రజలు, రైతులు పెనుకొండలోని ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు ఇక్కడే ఏర్పాటు చేశారని, ఆర్‌డిఒ కార్యాలయ సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



గుడిబండ, అగళి మండలం నరసంబూది, మడకశిర మండలంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌చిత్రపటాలకు పాలాభిషేకంచేస్తున్న కూటమి నాయకులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నరసింహనాయుడు సూచించారు. శుక్రవారం స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధులను నివారించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల పరిధిలోని దిన్నమీదపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు అధికారులు నిత్యావసరాలు అందజేశారు. ఈ మేరకు తహశీల్దార్ దేవేంద్ర నాయక్ సంఘటన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన తిరుమలయ్య ఇంటిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇంటిలోని సామగ్రి ధ్వంసమయ్యాయి. దీంతో తహశీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు బాధితుడిని పరామరించారు. తక్షణ సహాయంగా ప్రభుత్వ పరంగా అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ వలి భాష, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -నంబులపూలకుంట

గ్రామాల అభివృద్ధి దృష్టి సారించాలని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈటె రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్ మెంబర్ సోమ్లా నాయక్, తహశీల్దార్ దేవేంద్ర నాయక్, మార్కెట్ యార్డ్ చైర్మన్ అనసూయచౌదరి, ఎంఇఒలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి, ఎస్ఒ రెహానా, ఏపీఎం వెంకటనారాయణ, విద్యుత్ ఏ.ఈ సాలెహ్ భాష, తదితర అధికారులు, ఎంపీటీసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జోనల్ లెవెల్ సెలక్షన్ ఆఫ్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు ప్రోగ్రాం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించడం జరుగుతుందని ఆసంస్థ కోఆర్డినేటర్ దేవరాజు తెలిపారు. ఈ పోటీలలో కడప అనంతపురం, సత్య సాయి జిల్లాల నుంచి సి డబ్ల్యూ ఎస్ ఎన్ కింద 15 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, వారికి ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అడవుల సంరక్షణపై వ్యాసరసర పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుట్టపర్తి సెక్షన్ ఆఫీసర్ చంద్ర నాయక్ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాక బీట్ ఆఫీసర్ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. విజయమ్మ, ఉపాధ్యాయలు, మల్లెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డు మూర్తి పల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. తాము తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే. కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బోరు బావి తవ్వించినట్లు మున్సిపాలిటీ 33 వ వార్డు కౌన్సిలర్ పివి రమణ నాయుడు తెలిపారు. బోరులో నీరు పుష్కలంగా పడడంతో మూర్తి పల్లి వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మండల అభయ్ దివ్యాంగుల సమైక్య సభ్యుల చేతుల మీదుగా 2026 ప్రజాశక్తి క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాశక్తి దినపత్రిక చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అభయ్ దివ్యాంగుల సమైక్య తలుపుల అధ్యక్షుడు కేబి శ్రీరాములు శ్రీనివాసులు వెంకటేశు, లక్ష్మీనారాయణ, మహేశ్వరి పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

అనంతపురం నగరంలోనినడిమి వంక ప్రక్కన వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ బత్తల హరి ప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు రెండు లక్షల రూపాయలు నగదును వడ్డె ఓబన్న జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులకు విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో వడ్డె ఓబన్న జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్,జైరాం కో, కన్వీనర్ దేవర్ల మురళి, మరియు సభ్యులకు ,దళవయ్య వెంకటనారాయణ, వెంకటేశులు, వడ్డే గోపాల్, రామకృష్ణ పాల్గొన్నారు.

కొత్తచెరువు ఎస్ఐగా వెంకటరాముడు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు ఎస్ఐగా ఎస్.వెంకట రాముడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కొత్తచెరువులో ట్రాఫిక్ నియంత్రించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మహాసభకు తరలిన కార్మిక సంఘాల నాయకులు



మహాసభకు బయలుదేరి వెళుతున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విశాఖలో జరుగుతున్న ఆల్ ఇండియా సిఐటియు మహాసభలో పాల్గొనడానికి శ్రీ సత్యసాయి జిల్లా లోని కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. సిఐటియు కార్మిక సంఘాల నాయకులు ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో జిల్లాలోని సిఐటియు, భవన కార్మిక, సంఘాల నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. కార్మికుల చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విశాఖలో ఆలిండియా మహాసభలో జరుగుతున్నందున శ్రీ సత్యసాయి జిల్లా నుండి బస్సులు ,మినీ బస్సులలో బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, కో కన్వీనర్ టైలర్ ముస్తఫా, నౌషాద్ ,శ్రీరామ్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : విశాఖలో జరుగుతున్న ఆల్ ఇండియా మహాసభలో పాల్గొనడానికి ముదిగుబ్బ మండలంలోని నాయకులు సిపిఎం ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో 20 మంది బయలుదేరి వెళ్లారు, ముదిగుబ్బ నుంచి మినీ బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, కో కన్వీనర్ టైలర్ ముస్తఫా నౌషాద్, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఆత్మవిశ్వాసంతో రాణించాలి

రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీల ప్రారంభంలో మున్సిపల్ చైర్మన్


పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

వికలాంగులు తమ అంగవైకల్యంతో నిరుత్సాహానికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. లూయీ బ్రెయిలీ 217 వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రెండు రోజులపాటు ఈ క్రికెట్ పోటీలను మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, ఎస్.డి.జి.ఎస్. క్రీడా మైదానంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుండి 7 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. అంధులు పరస్పరం ప్రోత్సహించుకునే తత్వం క్రీడల ద్వారా సాధ్యమని, దాని ద్వారా అంధులు సమాజంలో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని తెలియజేశారు. విభిన్న ప్రతిభావంతుల్లోని ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించేందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంగవైకల్యం చదువు, క్రీడలు, ఉద్యోగానికి అడ్డు కాదన్న విషయాన్ని లూయి బ్రెయిలీ తన ప్రతిభ ద్వారా చూపారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంధ ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర బాబు, భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అర్జున పురస్కార గ్రహీత అజయ్ రెడ్డి, సత్యసాయి జిల్లా శాఖ అంధ ఉద్యోగ సంఘ అధ్యక్షులు విశ్వనాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బిఐ ఆసరా


మెగా చెక్కును బాధితులకు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇన్సూరెన్స్ అండగా నిలుస్తోందని, కార్పొరేట్ శాలరీ ప్యాకేజ్ కింద ప్రమాదవశాత్తు మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు భారీ ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ డి. శశిధర్ కుమార్ తెలిపారు. సోమందేపల్లి మండలానికి చెందిన విద్యుత్ శాఖ లైన్ మ్యాన్ బి. రామచంద్రారెడ్డి 2025 మార్చి 19న విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై, మార్చి 20న మృతి చెందారు. మృతుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా కలిగి ఉండి, అదే ఖాతా ద్వారా వేతనం పొందుతూ కార్పొరేట్ శాలరీ ప్యాకేజ్‌కు అనుబంధంగా ఉన్న ప్రమాద బీమా పథకంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ పథకం కింద మృతుడి కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా మొత్తం మంజూరైంది. శుక్రవారం సాయంత్రం హిందూపురం ఎస్‌బీఐ శాఖలో నిర్వహించిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డి. శశిధర్ కుమార్ ఆధ్వర్యంలో మృతుడి భార్య నారాయణమ్మకు కోటి రూపాయల మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడుతూ, తన భర్త ప్రభుత్వ లైన్‌మ్యాన్ గా విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో మృతి చెందాడని, ఈ కఠిన సమయంలో ఎస్‌బీఐ ప్రమాద బీమా పథకం ద్వారా కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకున్నందుకు బ్యాంక్ యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రాంప్రసాద్, స్థానిక బ్యాంక్ మేనేజర్ ఆర్. నాగేష్, విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ నాగన్న, ఏఈలు జబీఉల్లా, మహేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, లైన్ ఇన్స్ పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం


పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

హిందూపురం పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో నూతన రహదారి నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఇటీవల విడుదలైన రూ.92.50 కోట్ల నిధుల్లో రూ.20 లక్షలతో ఈ రహదారిని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. చాలా సంవత్సరాల నుండి రహదారి గుంతలు పడి పాదాచారులకు, వాహనదారులకు రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారిందని, వర్షాలు పడినప్పుడు రహదారి మొత్తం బురదమయం అవుతుందని, ఇకపై అలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, వార్డు ఇన్‌ఛార్జి హనుమంతు, టీడీపీ నాయకులు మోదా శివ, అమరనాథ్, వాసు, దుర్గా నవీన్, ఇందాద్, ప్రసాద్, నరేంద్ర, మారుతి, అశ్వర్థ, రామకృష్ణ, వెంకట రామప్ప, బాలాజీ కాలేజ్ ప్రిన్సిపాల్ వీరభద్రప్ప, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర క్రికెట్ జట్టుకు కదిరి క్రీడాకారిణి

ప్రజాశక్తి - కదిరి టౌన్


తేజశ్వని

భారత క్రికెట్ మండలి ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని నాగపూర్‌లో శనివారం నుండి జరిగే అంతర రాష్ట్ర అండర్ 15 బాలికల క్రికెట్ పోటీలకి కదిరి క్రీడాకారిణి తేజశ్వని ఎంపికైనట్లు కదిరి మండలం క్రికెట్ సంఘం కార్యదర్శి ఎల్లప్ప, కోశాధికారి ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు నందు జరిగిన రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ పోటీలలో తేజశ్వని 4 మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసి టోర్నీ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా ప్రతిభ కనబర్చిందన్నారు. అలాగే బ్యాటింగ్ లోను రాణించి 42 పరుగులు చేశారన్నారు. తేజశ్వని తండ్రి నరసింహ మూర్తి అటవీ శాఖలో ఉద్యోగి కాగా, తల్లి విజయలక్ష్మి గృహిణి. తేజేశ్వని సాధన పాఠశాల లో 9 వ తరగతి విద్యార్థిని. గత సీజన్ లోను తేజేశ్వని రాష్ట్ర జట్టుకు ఎంపిక అవ్వడమే కాక అంతర రాష్ట్ర పోటీలలో రాణించి 12 వికెట్లు తీసి జాతీయ స్థాయి క్యాంపు లో కూడా పాల్గొంది. ఈ పోటీలలో కూడా విశేషంగా రాణించి మరింత పై స్థాయి పోటీలకు ఎంపిక అవ్వాలని ఆశీస్సులును కదిరి శ్యాసన సభ్యులు, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, సాధన పాఠశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపారు.

బొలెరో, ఐచర్ ఢీ.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

బొలెరో, ఐచర్ వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని అగ్రంపల్లి గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు.. బొలెరో హిందూపురం నుంచి మడకశిర వైపు వస్తుండగా మడకశిర నుంచి హిందూపురం వెళ్తున్న ఐచర్ గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మండలంలోని అగ్రంపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సికె.పల్లికి చెందిన ఐచర్ వాహనం డ్రైవర్ మహమ్మద్‌రఫీ(33), మండలంలోని వడ్రపాలెంకు చెందిన బొలెరో వాహనం డ్రైవర్ రఘు(32) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెదిరింపుల కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ముల్లకంపలను కాల్చి బొగ్గుల వ్యాపారం చేస్తున్న మేస్త్రీని బెదిరించిన నిందితులను అరెస్టు చేసి ధర్మవరం కోర్టులో హాజరు పరిచినట్లు బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ తెలిపారు. రెండు రోజుల క్రితం మండలంలోని వేల్పుమడుగు వాగు సమీపంలో ముళ్ల కంపలను మహారాష్ట్ర కు చెందిన కూలీలతో కాల్చిన బొగ్గులను మహారాష్ట్రకు చెందిన బొగ్గుల మేస్త్రి సహాబ్రోలు పరశురాం రాథోడ్ లారీలో తరలిస్తుండగా టిడిపి నాయకులు అడ్డుకున్నారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డి, బత్తలపల్లికి చెందిన అప్పస్వామి, నల్లబోయినపల్లి గ్రామానికి చెందిన కౌశిక్,ముస్టూరుకు చెందిన బోయ సాంబ తదితరులు బొగ్గుల మేస్త్రీని బెదిరించి బొగ్గులు కాల్చుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని లేదంటే ఇక్కడనుండి బొగ్గులను ఎత్తుకొని వెళ్లలేరని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంలో తనకు సంబంధం లేదని బొగ్గుల వ్యాపారితో మాట్లాడతానని మేస్త్రీ చెప్పినా వినకుండా అతనిని నలుగురు వ్యక్తులు తీసుకెళ్లి అప్పస్వామి ఇంటిలో నిర్బంధించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో వదిలిపెట్టారని మేస్త్రీ సహాబ్రోలు పరశురాం రాథోడ్ చెప్పాడరన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టిడిపికి చెందిన నలుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి ధర్మవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రమైన బత్తలపల్లి బైపాస్ లోని వై-జంక్షన్ వద్ద శుక్రవారం ఆటోను ఐచర్ వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు అనంతపురం నుంచి కదిరి వెలుతున్న ఐచర్ వాహనం అనంతసాగరం నుంచి బత్తలపల్లికి వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సాకే ఈశ్వరయ్య, పోతలయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం లక్ష్మీ నగర్ కు చెందిన గంగాధర్(62) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు, గత కొంతకాలం నుండి గుండె జబ్బుతో బాధపడున్న గంగాధర్ తన గుండె జబ్బును బాగు చేయించడం కోసం అప్పులు చేశారు. చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపం చెంది శుక్రవారం తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు, గంగాధర్ భార్య అనూరాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం యర్రగుంట కూడలి ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ముందు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. శుక్రవారం తెల్లవారు జామున నాగసముద్రం వైపు వెళ్లే రహదారిమీద గుర్తు తెలియని వృద్ధురాలిని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

కేక్ తిని 15 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలో గురువారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయం నందు జిల్లా ఫారెస్ట్ అధికారికి నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కేక్‌ను కార్యాలయ సిబ్బంది ఎస్సీ కాలనీవాసులకు పంపిణీ చేశారు. కేక్ తిన్నవారిలో 15 మంది కాలనీ వాసులకు అస్వస్థతకు గురయ్యారు. వాంతులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచి నాగలక్ష్మి రాజు, వైద్య సిబ్బంది వెంటనే స్పందించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఒఆర్ఎస్ ప్యాకెట్లను, జింక్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. అస్వస్థతకు గురైన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సందర్భంగా ఎస్సీ కాలనీలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సురేష్, ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది రామ్మోహన్, మురళీకృష్ణ గౌడ్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



కిరికెరలో పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ చేస్తున్న నాయకులు


అమడగూరు మండలంలో పాసుపుస్తకం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


ముదిగుబ్బ మండలంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి హిందూపురం రూరల్

రూరల్ పరిధిలోని కిరికెర గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో అర్హులైన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య చేతుల మీదుగా రైతులకు అందజేశారు. టిడిపి రూరల్ కన్వీనర్ రాము మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా పట్టాదారు పాస్ బుక్ లపై జగన్ ఫొటో తొలగించి, రైతుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రను ముద్రించి, నూతన పాస్ బుక్ లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ క్లినిక్‌ల పేరుతో భూ సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేష్, వీఆర్వో, వీఆర్ఏతో పాటు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని హిందూపురం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించగా, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకుల సమక్షంలో రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రీసర్వే ద్వారా రైతుల భూమి హక్కులకు స్పష్టత వచ్చిందని, పాసుపుస్తకాలు రైతులకు భరోసానిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు టీడీపీ, జనసేన, కూటమి కన్వీనర్లు శ్రీనివాసులు, చిన్న ప్రవీణ్, కోఆర్డినేటర్ రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ఏవీ రమణ, మల్లికార్జున, బేకరి గంగాధర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : ప్రతి రైతు మొహాల్లో ఆనందం కనిపించేలా ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. అమడగూరు మండలం చీకిరేవులపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీ మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా రెవెన్యూ సమస్యలు లేకుండా చేయాలని అందుకు రెవెన్యూ అధికారులు ఎంతో చిత్తశుద్ధితో పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. జగన్ తీసుకొచ్చిన టైటిల్ యాక్ట్ ను రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రెండో సంతకంతో వాటిని రద్దు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అమడగూరు సహకార సొసైటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి , తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ , రైతు సంఘం జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి , కొత్తచెరువు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప ,టిడిపి యువ నాయకులు శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం మండలంలోని తుమ్మల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతులకు ప్రభుత్వ పట్టాదారు పాసుబుక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొట్లూరు సింగల్ విండోచైర్మన్ మేకల రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ గొట్లురు శ్రీనివాసులు, తహశీల్దార్ సురేష్ బాబు సర్వేయర్ గంగమ్మ, వీఆర్వో ప్రసాద్, తుమ్మల తెలుగుదేశం నాయకులు నరసింహారెడ్డి, పోతుల నాగేపల్లి ఆదినారాయణ, శ్రీనివాసులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : రాజు ముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను మండల పరిధిలోని కమతంపల్లి మద్దివారిగొంది తదితర గ్రామాలలో రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సోమశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ బాబూరావు, టిడిపి మండల కన్వీనర్ బి ప్రసాద్ నరసింహ, ఒది సింగల్ విండో అధ్యక్షుడు పి రామాంజ లు రెడ్డి, వీఆర్వో కిష్టప్ప రాజేంద్ర బాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని చౌటకుంటపల్లిలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటుచేసిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి రఘునాథరెడ్డి, తహశీల్దార్ మనోజ్ కుమార్, టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మర్తాడు గ్రామపంచాయతీలో "ఆంధ్రప్రదేశ్ రీ-సర్వే ప్రాజెక్ట్" భూ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవో మహేష్ పాల్గొన్నారు. రీ సర్వే తో భూ వివాదాలు తగ్గి,భూమి యాజమాన్యం పై స్పష్టత వస్తుందని ఈసందర్భగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణస్వామి, రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్ గంగన్న, మర్తాడు సర్పంచి కుళ్లాయి రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు,సచివాలయం సిబ్బంది,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని వానవోలు గ్రామంలో రీసర్వే చేసిన భూముల రైతులకు శుక్రవారం నాయకులు, అధికారులు నూతన పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా రైతులకు సంబంధించిన భూములకు హద్దులు కనబరచి, రీ సర్వే పూర్తి చేసి భూమి స్కెచ్, హద్దులతో హక్కు గల రైతులకు రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రమణ, సుబ్బారెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షుడు సంతోష్, వీఆర్వో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మర్తాడు గ్రామపంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో రైతులకు పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణస్వామి , మండల సర్వేయర్ సుశాంతి, రీ సర్వే డిటి గంగన్న, ఆర్ఐ భాస్కర్ రెడ్డి రెవెన్యూ సిబ్బందితో పాటు టిడిపిక్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.